# సొర్గం..నరకం

సొర్గానికి పోతానా... నరకానికి పోతానా..?

మబ్బు మబ్బుగా... నల్ల నల్లగా... నెత్తిన రెండు కొమ్ములు... నోట్లో రెండు కోరలు... చేతిలో జాటీ....యమదూతలా... అమ్మో.. అయితే నేను నరకానికేనా...

నేను చేసిన పాపమేమి?

పాలనురగ మాదిర్తో తెల్లగా అగపడ్తాండాది... తెల్లగా... తెల్లతెల్లగా... దేవదూతలు... హమ్మయ్య.. అయితే నేను సొర్గానికే...

నేను చేసిన పుణ్ణెమేమి?

"ఈడు అలివి మాలినన్ని పాపాలు చేసినాడు. నరకానికి తీసకపోతాం" యమదూతలు.

"ఈయన చానా పుణ్ణెకార్యాలు చేసినాడు. సొర్గానికి తీసకపోతాం" దేవదూతలు.

"ఎకరాలకు ఎకరాలు పంటలుబెట్టి ఎండబెట్టినాడు... ఎన్నెన్ని వేల మొక్కలు అలో లక్ష్మణా అంటా ఎండి సచ్చినాయో మీకు తెలీదా? వోటి వుసురంతా ఈడికి తగిలింది. నరకానికి తీసకపోవాల్సిందే" యమదూతలు.

"బతుకుదామనే ఆశ.. పదిమందికి పిడికెడన్నం పెడదామనే కోరిక... నీళ్ళులేక పంటలు ఎండిపోతే ఈయనేం చేస్తాడు... ఆ పాపం ఈయనది ఎట్లవుతాది....?" దేవదూతలు.

"అంతేనా....నీళ్ళ కోసరమని బూమాతను ఒళ్ళంతా తూట్లు తూట్లు చేసినాడు... ఆయమ్మ నొప్పితో గిలగిలలాడతాండాది.... తప్పు కాదా... పాపం కాదా?"

"నీళ్ళు లేకుంటే పంటలెట్ల పండతాయి... బువ్వెట్ల వస్తాది... ఆకలి తీరద్దా... నీకు మాదిరిగా వోళ్ళేమన్నా అమృతం తాగిండారా? పంట పండాల... కడుపులు నిండాల... నీళ్ళకోసరం బూమాతకు తూట్లు పొడిస్తే తప్పేముంది...పాపమెట్లవుతాది"

యమదూతలు...దేవదూతలు

దేవదూతలు...యమదూతలు...

గొడవ పడతాండారు ఈ బక్కరైతుకోసం...ఈ గౌడ చిన్నబ్బ కోసరం.

సొర్గానికి పోతానా... నరకానికి పోతానా?

అయ్యా దూతల్లారా... ఏండ్లకు ఏండ్లు ఎవసాయంతో రెక్కలు ముక్కలు చేసుకున్నే... అప్పుడు తెల్లా అది జూదమని... తెలుసుకునేలకు అప్పుల్లో మునిగిపోయినా... జూదంలో గెల్వలేననే పుగుగులమందు తాగి సచ్చినా... సొర్గానికో, నరకానికో... యాడికో ఒకతావుకు తీసకపోండి... నాకోసం మీకు తగువులొద్దు... అంతసేపు కాసుకోనుండే ఓపికా నాకు లేదు.

అమ్మా... తల తిరగతాండాది... కండ్లు బైర్లు కమ్ముతాండాయే. ఒళ్ళంతా పచ్చి పుండు మాదిరిగా వుండాది... మీరంతా దేవతా మనుసులే కదా... ఒగ అమృతం చుక్క నా గొంతులో యేయండి సోములూ... మళ్ళ మీరు ఎంతసేపన్నా కొట్లాడుకుందురు...

సోములూ...సోములూ... ఎళ్ళిపోతాండారా? కండ్లు బైర్లు కమ్మతాండాయే... గొంతారి పోతాండాది... నీళ్ళ చుక్కన్నా గొంతులోకి దిగితే బాగుండు... అమ్మా... గంగమ్మ తల్లీ... యిన్నాళ్ళూ ఎక్కడున్నావమ్మా... పిలస్తానే పలకతాండావే... నాగొంతు తడపతాండావే... యింగోచుక్క.. యింగోచుక్క గొంతులోకి...

కండ్ల ముందర మసక మసగ్గా... తెల్లగా తెల్లమోడం మాదిరిగా... నల్లమోడం అయితే బాగుండు... వాన పడతాది... ఆకాశమంతా తెల్లమోడం కమ్ముకున్నే బాగుండు... వాన పడతాంది... అరరే... టపటపా... రెండు నీళ్ళ చుక్కలు బుగ్గలపైన... ఏమైంది ఈ పొద్దు... వానదేవుడు కూడా కరుణించినాడే... తలవంగానే వాన కురిపిస్తాండాడే... అయ్యా సోమీ... యిదేదో యింతకు ముందు కురిసింటే నేను సచ్చిండను కదా... భార్యా బిడ్డలను అనాథలను చేసిండను కదా...

"మామా... మామా..."

సావిత్రి గొంతు మాదిరిగా వుందే... మేయ్ సావిత్రీ... నేను సచ్చిపాయనా... పై లోకానికి పోతాండా...

"మామా...మామా...నన్ను చూడు మామా"

సావిత్రీ.. నువ్వుగూడా నామాదిర్తో పురుగుల మందు తాగేసినావా... సచ్చిపాయనావా...నువ్వూ నా యనకంటీనే పై లోకానికి వచ్చేస్తాండావా? అయ్యో బిడ్డలు ఎట్లనే... నేదుర్లు! మా నాయన ఎట్లనే... ముసిలోడు! వోళ్ళకు నువ్వూ లేక, నేనూ లేక దిక్కెవరే... నువ్వెందుకు పానాలు తీసుకున్నేవే...

"కండ్లల్లో నీళ్ళు కారతాండాయి... తెలివిలోకి వస్తాండాడు... నాయనా చిన్నబ్బా... నేనురా... కండ్లు తెరిసి చూడరా"

చెంపలమీద వాన చుక్కలు... నాయన గొంతు... మసక మసకగా... బూసి పట్టినట్టు... మసక మసకగా నాయన ముఖం... సావిత్రి... నర్సులు... ఇంగా... ఎవురో వుండారు... మసక మసకగ్గా... ఎక్కడుండాను?

"మామా... మామా"

బుగ్గలు తడతాంది. సావిత్రి ఏడుస్తాంది.. నా సావిత్రి ఏడస్తాంది... చావలేదా నేను.... యమదూతలు, దేవదూతలు... సొర్గం నరకం...

"లేయ్ మాట్లాడరా.. కండ్లు తెరిచి చూడరా... నాయనా... చిన్నబ్బా"

"నాయనా...నాయనా"

నా బంగారుకొండ... మా ఇంటి ఎల్తురు... మారాజు... నా కొడుకు... యాడా... కనిపించడం లేదే... రెప్పలు మూతలు పడతాండాయే...

"నాయనా...నాయనా"

ఏడస్తాండాడా? నిన్ను చూడాలనుందిరా రాజా... రాజా అని పిల్వాలనుంది. దబ్బనంతో కుట్టేసినట్టు నోరు తెరుసుకోడం లేదురా రాజా...

"డాక్టరొస్తాండాడు"

"సార్... సార్... ఇప్పుడే తెలివిలోకి వచ్చినాడు... కండ్లు తెరిసి చూసినాడు సార్..."

"మీరంతా ఇలా పేషెంట్ చుట్టూ ఉంటే ఎలా? దూరంగా వెళ్ళండి... ఇక్కడ ఒక్కరు మాత్రమే ఉండండి. ఏం పేరు.. ఆ... చిన్నబ్బా... చిన్నబ్బా... కండ్లు తెరిచే ప్రయత్నం చేస్తాండాడు.... తెలివిలోకి వస్తాండాడు. ఇంకా పూర్తి కాన్షస్‌లోకి రాలా.. కొంచెం బెటర్... ఇంకా ట్వంటీఫోర్ అవర్స్ ఏం చెప్పలేము... సిస్టర్. ఈ పేషెంట్‌ను జాగ్రత్తగా గమనిస్తావుండు... క్రిటికల్ కేసు. అప్పులు చేయడం ఎందుకు, ఇట్ల సావడమెందుకు..."

"నాయనా చిన్నబ్బా...రేయ్"

"పెద్దాయనా, ఒకసారి చెప్తే అర్థం కాదా మీకు. బయటకు పోండి. పేషెంట్ దగ్గర ఒకరు మాత్రమే ఉండాల"

నర్సమ్మేమో.. నాయనను అరస్తాంది... డాక్టర్ ఎల్లిపాయనా...

సీమా సీమా... ఎందుకు కరిసినావంటే, నా బంగారు పుట్టలో ఏలు పెడితే కరసనా అనిందంట... అప్పులు చేయడం ఎందుకు... ఇట్ల సావడం ఎందుకాని... ఒగసారి నువ్వా ఎవసాయం మొదలు పెట్టు... అప్పులు చేస్తావో చెయ్యవో చూద్దాం... చావాలనిపిస్తాదో లేదో చూద్దాం...

నాకేమన్నా చావడం అంటే కుశాలా...

పెళ్ళాం బిడ్డలంటే బ్రమ లేదా? అయినా ఎందుకు సావాలనుకున్నే...

"ఇంతకుముందేన్నా తెలివిలోకి వచ్చిపాయ" నా సావిత్రి... ఎవురో వచ్చినారు.

"అయితే ఇంగేం భయం లేదులే".... ఎవురు ఎవురు.. గొంతు ఇన్నెట్లే వుండాదే....

"ఇంగా ఇరవైనాలుగు గంటలు ఏమీ చెప్పలేమన్నారు" నాయన... ఎవురొచ్చినారు...

"వాళ్ళట్లే చెప్తారులే... ఇట్లాంటి కేసుల్లో ఒకసారి తెలివిలోకి వస్తే మళ్ళా భయం లేదు... మా వూర్లో కూడా ఇట్లే, ఇద్దురు పురుగులమందు తాగినారు. ఈ మాదిరిగా నాలుగు దినాలు ఆస్పత్రిలో వున్నాంక తెలివిలోకి వచ్చినాయన బతికిపాయ... ఇంగో ఆయన సచ్చిపాయ... నాలుగైదు రోజుల్లో ఇంటికి పంపిస్తారులే..."

"అంతకంటేనా సోమీ... నీ నోట్లో చెక్కెర పోస్తాం"

"ఒకప్పుడు గుంటకదిందు మాదిర్తో ఉన్నాడు గదా... ఎట్లయిపోయినాడు... జాగ్రత్తగా చూసుకోండి.... నేను మళ్ళా వస్తాలే... ఇంకేం భయముండదు"

ఎవురు... వచ్చినాయన ఎవురు.. గెవనానికి రాలేదే... ఎట్లుంటాడు... ఎట్లున్నేను...

రింగురింగుల ఎంటికలు.. పక్కపాపిట తీసి, కోరమీసం పైకి తిప్పి, గళ్ళలుంగీ కట్టుకోని, ఎర్రపూల చొక్కాయి ఏసుకుంటే... ఎట్లున్నేదు... దసరా బుల్లోడులో నాగేశ్వర్రావే గదా...

ఒగటా, రెండా... నూరుకు పైగా జీవాలున్నేయి...

పద్దన్నే సద్ది తాగి....

యింత సంగటి మూటగట్టుకోని....

పుల్లింగట్టి సేతబట్టుకోని...

గొర్ల తోలుకోని మేతకు ఎలబారితే...

సందేళ దాకా ఎర్రగొండంతా నాదేగదా...

కొండ కొండంతా పుల్లింగట్టి ఎలుగింటా దానిస్తాన్నింది... సావాసగాళ్ళకు నేనంటే ఎంతిష్టమో....

ఒగసారి గోపాలగాన్ని ఎలుగ్గొడ్డు తరుముకునింది... నేను పుట్టి బుద్దెరిగిన యేళ నుంచి ఎర్రగొండలో ఎప్పుడూ ఎలుగ్గొడ్డును చూడలా... ఎప్పుడో, మా నాయన చిన్నప్పుడున్నేయంట.

వోడు కేకలేస్తా పరిగెత్తాండాడు... ఆ కేకలకు గొర్లు అట్లాగటి, ఇట్లాగటి పాయ.. "ఏమయిందిరా గోపాలగా" అంటా పరిగెత్తినా... సద్దునా బతుకుదునా అంటా వస్తాండాడు వోడు. వోని ఎనక ఎలుగ్గొడ్డు.. మొలలో బాకు తీసినా... కిల్లిల్లా అంటా కిలారిస్తా దాని ముందు దుంకినా... నా అరుపుకే అది నిలబడిపాయ.... చేతిలో బాకుతో నిలబడుకోనుండే నన్ను చూశాలకు దానికి ఏమనిపించిందో, ఆట్నించట్లే ఎనిక్కి ఎల్లిపాయ. వదల్తానా... ఎంటబన్నే అరస్తా.. గోపాల గూడా నా ఎనకంటీ వస్తాండాడు అరస్తా.. ఈ ముళ్ళపొదలో దూరి ఆ ముళ్ళపొదలోనించి బయటొచ్చి... ఈ గుండెక్కి ఆ గుండుమింద దుంకి... కంటికి కనిపించకుండా పాయ.

"నిన్ను చూస్తానే ఎలుగ్గొడ్డు నిలబడిసాయనే... నీ మొగంలో దానికి ఉగ్రనరసింహుడు కనబన్నేదురా" అన్నేడు గోపాలగాడు.

గొర్ల మేపుకునే ఈ చిన్నబ్బగాడేంది, ఉగ్రనరసింహుడేందిరా అన్నే నొగతా.

చెట్టుకొగటి పుట్టకొగటి పోయిన గొర్లను ఉడ్డదోలినాం... ఆపొద్దు సందేళ అందరికీ పలకదరువేసినట్టు చెప్పేసినాడు వోడు.

"వోడేమన్నా నీమాదిరిగా రెట్ట మనిసా... పైల్మాన్ మాదిరి ఉండ్లా"

"ఆ వచ్చిండేది మొగదేమో... అదే ఆడ ఎలుగ్గొడ్డు అయింటే ఈన్ని యిడ్సిపెట్టిండునా...కాపరం చేయమని ఎంటపడిండదా...?

"ఎలుగ్గొడ్డుతో కాపరం చేస్తే చేసినావుగానీ, బిడ్డలు మాత్రం నీ పోలికే ఉండాలబ్బోడా" అంటా కుశాలబట్టించినారు.

సందేళ గొర్ల తోలుకోని ఇంటికొస్తే, అమ్మ బాననిండుకు నీళ్ళు కాంచతాన్నింది...కాలే కాలే నీళ్ళు పోసుకుని...కాలే కాలే సంగటి కారంలో అద్దుకుని తిని పడుకుంటే... పైతెలీకుండా నిద్ర... అంతకంటే సొర్గమా...?

"ఎట్లుందిప్పుడు,,," ఎవురో వచ్చినారే... ఎవురోడు... యిన్నెగొంతేనే.

మబ్బు మబ్బుగా వుండాది.... కన్రెప్పలపైన ఎర్రగొండ పెట్టినట్టుంది... తెరుసుకోవడంలా... ఎవురు...

"పర్వాలేదన్నా"

"ఈ పొద్దే పద్దన తెల్సింది... ఎమ్మట్నే ఎలబారొచ్చినా..." నా బుగ్గల తడమతాండాడు... వాడే గోపాలగాడు... గోపాలగాడే... ఆ చేతులు, ఆ మాటలు వాడియే... అరే గోపాలా... గోపాలా...

మనిద్దరం పందెం ఏసుకుందామా...

నువ్వు ఏ కొత్త నులుగన్నా పాడు... ఇని ఎమ్మట్నే పుల్లింగట్టి వాయించకుంటే నా కుడిమీసం కత్తిరించుకుంటా... ఎన్నిసార్లు పందెం ఏసుకోలా... ఒగసారీ వాడు గెల్చలా... అరే గోపాలా.. గోపాలా...

"ఆయనలో ఆయనే ఏందో ఆలోచించుకుంటా బాధపడతాండాడన్నా... ఉండుండి కండ్లల్లో నీళ్ళు కారతాండాయి" సావిత్రి నా కండ్లనుంచి కారతాండే నీళ్ళను తుడుస్తాంది.

మాట్లడరా గోపాలా... మాట్లాడరా... నా సావాసగా... గోపాలగా మాట్లాడరా...

వాడికీ దుఃఖంగా ఉండదా... ఏడస్తాండాడా?

"పేషెంట్ దగ్గర ఏడుపులేందయ్యా... ధైర్యంగా వుంటే కదా" నర్సమ్మేమో అరస్తాండాది.

దైర్నం... దైర్నం...దైర్నం...

ఒంట్లో సత్తవ వుండాదనే కదా ఆ పని చేసింది..

ఇట్లారోజులు వస్తాయని అనుకోనుంటే, ఆపొద్దు ఆ పని చేసేవాడే కాదు.

ఇదంతా నాయన చేసిన పనే... ఆయన చేసిందాంట్లో తప్పేముందిలే... నా కోసరమే గదా... నా సుఖం కోసరమే గదా... నా బాగుకోసరమే గదా... ఎన్నబడే ఏళలో కుండబగులుతుందని ఆయనేమన్నా కలగన్నేడా?

అమ్మ అప్పటికి యిసపురుగు కరిసి సచ్చిపోయి ఆర్నెల్లాయ.

నాయన ఇల్లాదిలి బయటకు రావడంలే...

నేను పెండ్లికి పోయిన్నే... నాయనకు జొరంగా ఉంటే ఇంటికాన్నే ఉన్నేడు... అమ్మ గొర్ల ఎనకంటీ పోయింది... ఎర్రగొండకాడ యిసపురుగు కరిసింది. ఆట్నించీ ఇంటికొచ్చాలకే నోట్లో నురగ వచ్చేసింది. ఆస్పత్రికి బండ్లో ఏసకపోయినారు... డాక్టరు చూసి పాణం పోయిందన్నేడు.

అమ్మకు ఆ బగమంతుడు రాత ఆడికి రాసి పెట్టిండాడు.

గూట్లో గువ్వ మాదిరిగా దూరుకోనుండకపోతే బయటకు రా... అన్నే ఇనిపించుకోలా నాయన.

ఆ పొద్దు... పొద్దు గూట్లో పడేలకు గొర్ల ఇంటికి ఎల్లదోలినా... ఇంటికొచ్చాలకు మొబ్బయిపాయ. నాయన ఇంటి ముందర, నులక మంచంపైన పడుకోనుండాడు... గొర్లను దొడ్లో తోలినా. "ఇట్ల రా అబ్బోడా" అనె నాయన.

పోయినా... మంచం మీద కుచ్చోమన్నేడు.

కుచ్చాన్నే.

"మా తాతల కాలం నించీ గొర్ల మేపడమే బతుకు. కూటికి గుడ్డకు కొదవుండదు. సంసారాలు గొర్రైతోక బెత్తెడు మాదిరిగానే ఎదుగుదల వుండదు. రోజులు మారినాయి. ముందు మాదిరిగా, గొర్లు మేపుకునేవోళ్ళు ముందుకు రావడంలే. మా కాలంలో నూరు గొర్రైల ఆసామంటే, కాళ్ళను కండ్లకద్దుకోని పిల్లనిచ్చేవోళ్ళు. ఇప్పుడూ... ఎండా వానన బడి, అడివికి బోయి మా బిడ్డ గొర్ల మేపద్దా అంటాండారు... మనం గొర్లు అమ్మేద్దాం" అనె నాయన.

కొంచెం సేపు నాకే అర్థం కాలా...

గొర్లు అమ్మేసి ఏంచేస్తాం...

పిల్లప్పటి నుంచీ గొర్ల పింటికలతో ఆడుకున్నే...

వోటి మద్దెన తిరుగులాడినా...

వోటిని మేపతానే బతకతాండా...

"పల్లెముందర గుట్టకు ఆనుకోనుండాదే... సుబ్బరాముడి చేను, ఆ రెండెకరాలు అమ్మతాడంట... గొర్లమ్మి అది కొందాం. ఇంటి పట్టున ఉండి సేద్దిం చేసుకుందువు. మిగతా పొద్దుల కూలికి పోదువు"

సేద్దిం మనకు అలవాటు లేదుగదా నాయనా అంటి... నాకూ సేద్దింమింద మనసుండాది.

"నీకేంరా చెయ్యలేక... బండికి కోడెదూడలను కట్టి బాటలో వదిలినట్టే గదా, నిన్ను సేద్దింలోకి దింపితే... నువ్వు గనా మొనుసు పెట్టి ఒళ్ళు దాచుకోకుండా పని చేసినావనుకో, ఆ చేన్లో ఇత్తనాలు కాదురా, రత్నాలు పండించచ్చు" అనె నాయన.

వూర్లో చానామంది తిట్టిరి. అబ్బా,కొడుక్కు ఏం పోయేగాలమొచ్చింది... బంగారట్లా గొర్రెలను అమ్ముకుంటారా... వృత్తిని వొదులుకుంటారా... దొడ్లో గొర్రెలున్నాయంటే, అర్ధరాత్రి ఏ ఆపదొచ్చినా... దొంగ చేతికిచ్చినా గొర్రెకు ఐదు నూర్లిస్తాదు... గొర్లమ్మి చేనుగొని సేద్దెం చేయడమంటే 'ఉర్లబోసి ఏరుకోవడమే గదా' అనిరి.

ఎవురి మాటా ఇనలా... నెలకంతా గొర్లన్నీ అమ్మేసి చేను కొంటిమి... ఇంగా ఐదువేలు దుడ్డు మిగిలె... ఇంగో రెండు వేలు అప్పు చేసి కాడెద్దులు కొంటిమి.

నాయనకు రేయింపొగులూ చేనూ ఎద్దులే.

తొలీగా చెనిగ్గింజలు ఏస్తిమి... అదునుకు వాన పడె... బాగనే పండె... కొంచెం మిగులుబాటాయ. ఎద్దులు పెట్టుకోని కూలి పనులకు పోతాంటి... గుడిసిల్లు పోయి ఆరంకణాల కొట్టం ఏస్తిమి... నాయన సమ్మందాలు చూసె... పులిచెర్ల కురప్పల్లిలో సావిత్రితో పెండ్లాయె... నా సావిత్రి... బంగారు సావిత్రి... నా మల్లె మొగ్గ... ఎంత మంచిదో... ఇంట్లో, పనుల్లో బాగా ఒదిగిపాయ... మూడేండ్లాయ... ఒగసారి చెనిగి ఎండిపాయ... ఎడ్లతో మడకలు దున్నేదానికి పోతాంటిమి... సావిత్రి గమ్మునుండే మనిసి గాదు, కష్టజీవి. కూలికి పొయ్యేది... కొంచెం ఎనకేసు కొంటిమి... నాలుగో సంవత్సరానికి రాజు పుట్టె...

నాయనకు ఎంత సంతోసమో... నాగ్గూడా...

"బిడ్డొచ్చిన యేళ, గొడ్డొచ్చిన యేళ అంటారు... అమ్మి వచ్చినాంక బాగా కలిసొచ్చిందిరా" అనేవాడు నాయన.

రాజుకు రెండేండ్లాయ... పాప పుట్టె... సంసారం పచ్చగా ఉండె... పైరూ పచ్చగా ఉండె...

కొట్టం కొట్టేసి ఆరంకణాల మిద్దె కడ్తిమి... గొళ్ళల్లో అదే తొలి మిద్ది. వూర్లో ఈ చిన్నబ్బ గౌడంటే ఎంత గౌరవమో... ఏ పండగొచ్చినా పబ్బమొచ్చినా ముందుండాల్సింది నేనే. అన్నింటికీ 'చిన్నబ్బ రానీండబ్బా' అనేటోళ్ళు.

ఎంత కుశాలగా ఉన్నేయా రోజులు...

ఎంత సంతోసంగా ఉన్నేయా రోజులు...

అదునుకు వాన పడితే సంతోసం... అదునుకు ఇత్తనం భూమిలో పడితే సంతోసం... గింజ మొలకెత్తితే సంతోసం.

మొలక రెమ్మలేస్తే

రెమ్మలు పూత పూస్తే

పూత కాయ కాస్తే

కాతంతా ఇంటికొస్తే... సంతోసం... సంతోసం...

పంట గింజలు, బందుగులు ఇంటినిండా వుంటే... అది సొర్గమే గదా...

"నవ్వుతాండాదే"

ఎవురో వచ్చినారు... ఎవురిదీ గొంతు.

"ఆయనలో ఆయనే నవ్వుకుంటా, ఏడుస్తా వుండాడు. పద్దట్నించీ యింతే... నాకెందుకో భయంగా వుండాది"

సావిత్రి ఏడుపు గొంతుతో మాట్లాడతాంది...

సావిత్రి... నా సావిత్రీ... మనకు ఏడుపు తప్ప ఏం మిగిలిందిలే...

"బుర్రలో పురుగు పాడయింటాది... మా అల్లుడు గూడా ఇంతే... అయితే వోడు యాపారం చేసేవాడులే, సేద్దింగాదు. అప్పులయిపాయని మాత్రలు మింగేసినాడు. టయానికి వోన్ని ఆస్పత్రిలో ఏసినాం. అయినా ఆర్నెల్లు పట్టింది. పిచ్చి పిచ్చిగా మాట్లాడతా వుండేవోడు..."

ఎవుడీడు... రేయ్ ఎవురికిరా పిచ్చి... ఇది పిచ్చా... నా బతుకును తల్చుకోవడం పిచ్చా... నేను నవ్వుకోవడం పిచ్చా... నేను ఏడ్చుకోవడం పిచ్చా... రేయ్... రేయ్... ఎవురికిరా పిచ్చి...

"చూస్తివామ్మా... ఇప్పుడే గదా నవ్వినాడు... అప్పుడే ఏడస్తాండాడు చూడు... ఆయప్పకు ఏమేమి మతికొస్తాండాయో"

నా సావిత్రి... కండ్లనుంచి కారతాండే నీళ్ళు తుడస్తాంది... బుగ్గలు తడమతాంది...

సావిత్రి... నా సావిత్రి... ఒక్కసారి నన్ను కౌగలించుకోవా...

ఒక్కసారి నీఒడిలో తలపెట్టి పడుకోనీవా... సావిత్రీ... నా సావిత్రీ...

"ఏం కష్టమొచ్చిందమ్మా యిట్ల చేసుకున్నేడు"

కంటి రెప్పలపైన వుండే ఎర్రగొండను ఎవురన్నా తీసేస్తే బాగుండు. లేసి నడుసుకుంటా పోయి... కండ్లు తెరచ్చు... చుట్టూ ఎవురు తిరుగులాడతాండారో, ఏంచేస్తాండారో తెలస్తాది...

నా శరీరం... నా ప్రాణం సావిత్రిని... నా బంగారుకొండ రాజును... మా ఇంటి మాలక్ష్మి పాపను... మా కోసరం బతకతాండే నాయనను చూడచ్చు... తనివి తీరా చూడచ్చు... చూస్తే చాలు...

నేను చేసిన పనికి వోళ్ళు యేడస్తాంటే... కదలలేని నన్నుచూసి బాధపడతాంటే... అది చూసి నేను యేడిస్తే... నా యేడుపు చూసివోళ్ళు యేడిస్తే... యేడుపు... యేడుపు... యేడుపు...

బతుకంతా ఏడుపేనా...

సేద్దిమంటే ఏడుపేనా...

ఏడుపు గొట్టు సేద్దిం చేయకుంటేనేం? చేయకుంటే...

"కష్టాలేముంటాయన్నా... మామూలే... కొత్తగా వచ్చిందేమీ లేదు..." సావిత్రి చెప్తాంది.

మనకు కష్టాలు రాలేదా సావిత్రీ... మనం కష్టాల్లో లేమా సావిత్రీ...

కష్టాలు... కష్టాలు... ఎప్పుడు మొదలైనాయి? ఎప్పుడు...

అప్పటికి పిల్లోనికి నాలుగేండ్లు... వానలు సరిగ్గా పడడంలేదు. చెనిగి రెండేండ్లు ఎండిపాయ... రెక్కల కష్టం... పెట్టుబడి బీటికి పాయ... బావుల్లో నీళ్ళసుక్క లేదు... చెరువులు ఎప్పుడో ఎండిపాయ... పెద్దకరువు... పనుల్లేక చానామంది నెల్లూరు దిక్కు పలస్తంపాయిరి... భూమున్నోళ్ళు వుండిపాయిరి. నేనూ పోతానంటే నాయన, సావిత్రి ఒప్పుకోలా.

కూలికి పోదామన్నే పనుల్లే...

ఒగరోజు ఎందుకొచ్చిందో ఆలోచన... ఎందుకో ఎందుకు, బతకదామనే గదా... కమ్మారపల్లెలో అందరూ సేద్యగాళ్ళే.. ఐదెకరాలకు తక్కువ లేని రైతు లేదు... కొందరికి పదీ, పదైదు ఎకరాలు గూడా వుండాయి... అందరికీ బావల్లో నీళ్ళు లేవు.. చానామంది బోర్లేసినారు... కొందరికి నీళ్ళు పన్నేయి... వోళ్ళ పొలాలు పైర్లతో పచ్చగా వుండాయి...

ఆ పచ్చదనం చూసేలకు ఆశ పుట్టింది.

మనమూ బోరేద్దామా అన్నే నాయనతో.

"బోరేస్తే... దుడ్డు దుమ్ములో కలిపేసినట్టేగదరా... ఒద్దులే" అన్నేడు నాయన.

కమ్మారపల్లెలో చూసినావా... ఎంతమంది పంటలు బెట్టిండారో... అన్నే.

"చూసినా... చానామందికి చానా బోర్లు పెయిలంటనే... నీళ్ళు పడిండేది కొందరికే... వానొస్తాదిలే... ఎప్పుడూ ఇట్లే వుంటాదా కాలము... ఎన్ని చూళ్ళా ఇట్లా వొరుపులు"

వానను నమ్ముకుంటే ఏమీ పండిచ్చుకోలేం... పంటబెట్టకపోతే చేను వుండీ లేనట్టేగదా...

"ఇంతకాలం చేను వుండి, సేద్దిం చేసే బతికినామా" అనె నాయన.

"సేద్దిం చేసిన కాన్నించే మనం రోంతయినా ఎనకేసుకున్నేం. మీ తాతల కాలం నించీ గుడిసిల్లే... ఇప్పుడు మిద్దిల్లు కట్టుకోనుండాం... మీ కోడలికి సొత్తులుండాయి..." అన్నే.

"కాదనలేదబ్బోడా... వాన పడితే పంటబెడతాం... లేదంటే లేదు... ఒగేళ వాన కడాన పడలేదంటే, మన ఇత్తనం గింజలు, రెక్కల కష్టం బీటికి పోతాయంతే... బోరట్ల గాదే... నీళ్ళు పడతాయో లేదో తెలీదు... వేలకు వేలు చలవ చెయ్యాల... మళ్ళా కూడా... వస్తుందో రాదో చెప్పలేని వాన మాదిర్తో, బోరులో నీళ్ళు ఎప్పుడు నిల్చిపోతాయో తెలీదు... రెండందాలా నష్టం. ఎందుకురా ఇదంతా" అన్నేడు నాయన.

అట్లనుకుంటే ఎట్ల నాయనా? ఇద్దురు బిడ్డలుండారు... మనకోసరం గాకపోయినా, వాళ్ళ కోసరమన్నా సంపాదించాలగదా అంటి.

"నాగ్గూడా బోరంటే బయంగా వుండాది మామా... మనకేం తిండికి జరగతాండాది గదా" అనె సావిత్రి.

"తిండికి జరిగితే చాలా... బిడ్డలు పెరగతాండారు... వోళ్ళను బాగా చదివించద్దా దుడ్డు యాట్నించీ పస్తాది... సంపాదించాల గదా" అంటి. సొసైటీ బేంకిలో పదివేలు, ఇండియను బేంకిలో ఐదువేలు అప్పు తీసుకుని బోరేస్తిమి.

బోరేసే ముందురోజు రేత్తిరంతా కంటిమింద కునుకు పడలా... నీళ్ళు పడకపోతే పదైదువేలు బీటికి పోయినట్టే గదా... సంపాదన లేందానికి మళ్ళా అప్పా...

రెండించుల నీళ్ళు...

చుట్టుపక్కల పూర్లల్లో అంతా "చిన్నబ్బగాడికేంబ్బా... అదృష్టం ఏపబంక మాదిర్తో అతుక్కోని వుండాది. మేం ఎన్నెన్ని బోర్లేసినామో... అన్నీ ఫెయిలే" అనిరి.

"ఆరు బోర్లేస్తి... నీళ్ళు పడలా... ఇంగ ఇదే కడ అనుకుని ఏడోతూరి బోరేస్తిమి. నీళ్ళు పన్నేయి... చిన్నబ్బకు తొలీగానే నీళ్ళు పన్నేయే"

నాకు పిర్రలమింద పలక వాంచినట్టాయ... ఇంగో పదివేలు అప్పు చేసి మోటారు బిగిస్తి.

చేనంతా సదరంగట్టి, తొలీగా... ఎందుకైనా మంచిదని ఎలిపంటేస్తిమి... బాగానే వచ్చె. బోర్లో నీళ్ళు తగ్గలా... రెండోతూరి వరి ఏస్తిమి...

తదారకుండా నీళ్లు కడితి...

దండిగా ఎరువులేస్తి...

పైరు పచ్చమోడం మాదిరిగా వుండె... చూసినోళ్ళంతా 'ఏముంది పైరు' అనిరి. దిష్టి తగలతాదని కుండకు సున్నంబొట్లు పెట్టి, కట్టికి కడితి... నాయన రేయింబగుళ్ళు అన్నే... పైరు పొట్టకొచ్చె... ఎన్నిడిసె... పాలకొచ్చె... అప్పుడు గదా బోర్లో నీళ్ళు తగ్గిపోయింది... వారానికంతా పూర్తిగా నిల్చిపోయ... రెండెకరాలు... పైరు బాగుంది.. పంట చేతికొస్తే కనీసం ఇరవైవేలు చేతికొస్తాది... నీళ్ళు... నీళ్ళెట్ల... బోరేయాల... దుడ్డు... దుడ్డు...

మళ్ళా పదైదువేలు అప్పు... బోరు... నీళ్ళు పడలా... పైరు వాడుమొగం బెట్టె... అట్ల చూస్తా వుండబుద్ధి కాలా...

సావిత్రి చైను బేంకిలో పెట్టి, వుంగరాలు అయినకాడికి తెగనమ్మి మళ్ళా బోరు... మళ్ళా రెండించుల నీళ్ళు పడె... అందర్లో సంతోసమాయ. అప్పటికే ఆలస్యమాయ... నీళ్ళందక పాలగింజలు గట్టి పడలా... పంటలో సగంకన్నా ఎక్కువ జొల్లే...

పక్కన ఇంగో రెండెకరాలు కౌలుకు తీసుకుని, టమేటా ఏస్తిమి... కాపున్నెప్పుడు రేటులే... రేటున్నెప్పుడు కాపు తగ్గిపాయ.

బోర్లో నీళ్ళు తగ్గలా... మళ్ళా వరి పైరు పెడితి...

దురదృష్టం పడిసెం పట్టినట్టు పట్టిండాది. పొట్టకర్రతో వున్నెప్పుడు బోర్లో నీళ్ళు ఎండిపాయ... దిగులయిపాయ... నెర్రెలు చీలిండే నేలను చూస్తే బాధేసేది... అప్పు పుట్టడంలే... ఇట్లగాదని పొలం తాకట్టు బెడితి... బోరేస్తి... ఏ దేవుడూ కనికరించలా... రైతుల్ని దేవుడు కనికరించేట్లయితే ఇన్ని బాధలెందుకుంటాయి... బోర్లో నీళ్ళు పడలా...

నాయన పొలంకల్లా వచ్చేది మానుకున్నేడు.

నీళ్ళు లేక ఎండతాండే వరిపైరును చూస్తే పాణం గిలగిలలాడేది...

ఇన్నినోటి పాణం నేనేగదా అన్నేయంగా తీస్తాందాను అనిపించేది...

నేను నానెయ్యకుండా వున్నింటే వడ్లు మొలకెత్తిండవు.

నాట్లెయ్యకుండా వున్నింటే ఇంత ఎదిగిండవు...

నారు పోసినోడే నీరు పొయ్యాలంటారు...

నారు పోసి నీళ్ళు పొయ్యకుండా సంపతాండా ఈటిని... ఈటి వుసురు తగలతాదేమో అని బయమేసేది.

ఒగరోజు, ఎండిపోయిన వరిపైరులో గొడ్లను తోలింది సావిత్రి.

గొడ్లు పైరును పరపరామని కొరకతా వుంటే, ఎదుర్రొమ్ము మీద ఎంటికలను ఎవురో పెరకతాన్నెట్టు అనిపించింది... కండ్లల్లో నీళ్ళు తిరిగినాయి... ఇంతకంటే నరకముంటాదా?

బోర్లేయడం మొదలుపెట్టిన రెండేళ్ళలోనే బతుకు తల్లకిందులాయ...

పెట్టిన పంటలు ఎండిపాయ... వచ్చిన పంటలకు రేటు లేకపాయ...

ఓడలు బండ్లవుతాయంటే ఇదేనేమో...

అప్పులోళ్ళంతా ఇంటిమిందికి వస్తాందారు?

ఏమని సమాధానం చెప్పేది... సంపాదన వచ్చే దోవ ఏదీ?

నీళ్ళులే... పంటల్లే... పనుల్లే... ఎట్ల బతకాల... ఎట్ల తీర్చాల...

సొసైటీ వాళ్ళొగపక్కన... ఇంటికి బీగం ఏస్తామంటా వుండారు. అంతకంటే అవమానమా...

నువ్వు సావనన్నా సావు, మా అప్పులు తీరతాయి అనె ఒగ ఆసామి... ఆయనకు ఇయ్యాల్సిన ఇరవైవేలకు నేను పాణం తీసుకోవాల్నా? వేరే దోవ ఏముంది... చావే గతి...

ఇప్పుడు, ముందు మాదిరిగా రైతు చనిపోతే ఒగటిన్నర లక్ష ఇవ్వడం లేదంట...

వోళ్ళు ఒగరూపాయి గూడా ఈకుంటే పోనీ... ఈ అవమానాలు తట్టుకోని బతకలేదు... అంతే... అంతే...

పురుగుల మందు తాగాల్సిందే...

సావిత్రి... బిడ్డలు... నాయన... తల్చుకుంటే మనసు కొట్టకలాడతాది...

అప్పులోళ్ళు... నీళ్ళు లేని బోర్లు... పండని పొలం... సావాల్సిందే... ..లోపలికి పోయి పురుగుల మందు తాగేసినాడు... ఎవురో తెచ్చి ఈ ఆసుపత్రిలో ఏసినారు... సచ్చిపోయింటే బాగుండు. సచ్చిపోయింటే బాగుండునా? ఎవురికి?

పొలం తాకట్టులో వుంది...

వేలకు వేలు అప్పులుండాయి...

ముసలి నాయన, నన్నే నమ్ముకోనుండే సావిత్రి... నేదరు బిడ్డలు... వాళ్ళ బతుకేంగావాల?

వాళ్ళకూ తలా కొంచెం పురుగుల మందు తాగిచ్చింటే...

అయ్యో... సావిత్రీ, నాయనా... నా బిడ్డల్లారా... మీకన్యాయం చేస్తాంటినే...

"కండ్లల్లో నీళ్ళు తుడమ్మా" నాయన గొంతు...

"డాక్టర్ రౌండ్స్‌కు వస్తాండారు... బయటకు పొండి" నర్సమ్మేమో... అరస్తాంది.

డాక్టర్... డాక్టర్... అప్పుల్నేం చేయాల! పంటలు ఎట్ల పండించాల?

డాక్టర్... డాక్టర్... డాక్టర్... నాడి చూస్తాండావా... అందతాండాదా... పాణగండం లేదా...

నేను బతకాల డాక్టర్... బతికే దోవ ఏదీ?

పొలం తాకట్టు... పంటల్లేవు... అప్పులు... బతికే దోవ?

అప్పుల్లేనోళ్ళుండారా... ఎంత చెట్టుకు అంతగాలి... అంతేనా... అంతే... అంతేగదా... అప్పులున్నే బతకొచ్చు... పొలం లేకున్నా బతకొచ్చు...

డాక్టర్... డాక్టర్... నేను బతకాల...

తిరపలికి పోతా... ఎద్దుల బండి తోలతా... బతుకు బండిని లాగిస్తా...

డాక్టర్... డాక్టర్... నేను బతకాల.

ఇంగెప్పుడూ పురుగులమందు తాగను...

ఇంగెప్పుడూ పురుగులమందు జోలికి పోను...

నేల చూస్తే దున్నదామనిపిస్తాదే...

యిత్తనం చూస్తే నాటదామనిపిస్తాదే...

పచ్చదనం చూస్తే మనసుకు సొర్గం అనిపిస్తాదే...

డాక్టర్... డాక్టర్... నేను బతకాల...

"కేస్‌షీట్ ఏదీ...ఇప్పటికే నాలుగు రోజులయింది కదా... కళ్ళు తెరస్తా మూస్తా వుండాడన్నారు... హి ఈజ్ అవుటాఫ్ డేంజర్"

డాక్టరేదో అంటా వుండాడు...

డాక్టర్... డాక్టర్... నేను బతకాల... •

*ఈవారం జనవార్త కథల పోటీలో బహుమతి పొందిన కథ.*

*జనవరి 27- ఫిబ్రవరి 2, 2008 ఈవారం*